క్లుప్తంగా

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పొన్నూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

పెదకాకాని: మైనర్లకు నడపటానికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి అన్నారు. గురువారం రోడ్డు ప్రమాదాలపై సీఐ మాట్లాడుతూ మైనర్లు రోడ్లపై బైక్‌లు నడుపుతూ షికార్లు చేయడం, వారు ప్రమాదానికి గురికావడంతోపాటు రోడ్డుపై వెళ్లే వారిని భయబ్రాంతులకు గురిచేయడం జరుగుతోందన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ఆటోలను సీజ్ చేస్తామన్నారు. వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని సీఐ కోరారు. ఇప్పటికే హెల్మెట్ ధరించాలని పలుమార్లు ప్రత్యేక తనిఖీల ద్వారా వాహనదారులు తెలియజేశామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా సహకరించాలని సీఐ సూచించారు.

పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

పెదకాకాని : పెంచిన ఎల్పీజీ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడంపై గురువారం నన్నపనేని మాట్లాడుతూ సామాన్య ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి వెంటనే ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 మేర పెంచడం వల్ల సామాన్య వినియోగదారులపై భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ల ధర పెంచడం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పొన్నూరు: మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం ఆలయ వంశపారంపర్య అర్చకులు విజితేంద్ర .. స్వామి వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ప్రాంగణ నియామకాలలో 16 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఇది ఎంతో సంతోషకరమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికలలో రూ. 3 లక్షల నుంచి రూ 5.5 లక్షల వరకు ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించాయన్నారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

ముగిసిన కోదండ రాముని ఉత్సవాలు

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీబొమ్మ సెంటర్ శ్రీకోదండ రామాలయంలో నిర్వహిస్తున్న సీతారామ కల్యాణ మహోత్సవాలు గురువారం ముగిశాయి. పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం స్వామి వారి పవళింపు సేవ జరిగింది. ఆలయ అధ్యక్షులు కొమ్మినేని శివకోటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, కోశాధికారి కె.ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అతిథి గృహం.. సమస్యల నిలయం

- పరిసరాల్లో పాముల సంచారం
- వేసవిలోనూ పని చేయని ఏసీలు
- ప్రాంగణంలో దర్శనమిస్తున్న ఎండిన చెట్లు



శిథిలావస్థకు చేరిన భవనం



అతిథులకు అసౌకర్యంగా మారిన బంగ్లా

పొన్నూరు : రోడ్లు, భవనాలను అభివృద్ధి చేసే శాఖలోనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ఆ శాఖకు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరినా అభివృద్ధికి యంత్రాంగం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. కార్యాలయం ప్రాంగణమంతా ఎండిన చెట్లతో దర్శనమిస్తోంది. ఇన్‌స్పెక్షన్ బంగళాలోని ఏసీలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అసౌకర్యం తప్పడం లేదు. ఆర్ అండ్ బీ కార్యాలయంలో సమస్యలు తిష్ట వేసినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. రూ. కోట్ల నిధులతో మండలంలో అభివృద్ధి పనులు చేపట్టే ఆ శాఖ భవన సముదాయాలు పలు సమస్యల వలయంలో చిక్కుకున్నా పట్టించుకోవడం లేదు. ప్రాంగణంలో పగుళ్లిచ్చి వినియోగంలో లేని భవనం పాములు, విష పురుగులకు ఆవాసంగా మారింది. పరిసరాలలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారినా వాటి తొలగింపు పట్టించుకునేవారే కరవయ్యారు. ఉన్నతాధికారులు బస చేసేందుకు వీలుగా నిర్మితమైన ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. బంగ్లాలోని రెండు ఏసీలు గత కొంతకాలంగా పనిచేయడం లేదని సిబ్బంది చెప్పారు. బంగ్లాలో ఏళ్ల తరబడి ఉన్న ఏసీలతోనే కాలం వెళ్లదీస్తున్నారే తప్ప వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక అతిథులకు అసౌకర్యంగా మారింది. దీంతో పొన్నూరులోని అతిథి గృహంలో బస చేసేందుకు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కీలక పోస్టులు ఖాళీ..!

మహిళా శిశు సంక్షేమ శాఖలో భర్తీకాని పలు పోస్టులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ మహిళా శిశు అభివృద్ధి శాఖలో 243 సీడీపీఓ, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగాలకు 2023లోనే ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. వీటి భర్తీ నిర్వహణ ప్రక్రియను ప్రతిసారి ఏపీపీఎస్సీ నిర్వహించేది. గత ప్రభుత్వం వివిధ కారణాల వల్ల ఈ బాధ్యతను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌కి అప్పగించింది. సంబంధిత ప్రక్రియ నిర్వహించిన అనుభవం లేకపోవడం వల్ల సకాలంలో నియామకాలు చేయలేకపోయింది. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తర్వాత భర్తీ విషయం మరుగున పడిపోయింది. ప్రభుత్వాల మార్పు అభ్యర్థుల పాలిట శాపంగా మారింది.

అభ్యర్థుల ఆవేదన

గతంలో ఈ సీడీపీఓ పరీక్షలకు భర్తీ 2013లో జరిగింది. దాదాపు 12 సంవత్సరాలుగా ఈ ఉద్యోగాల భర్తీ లేదు. పెరుగుతున్న వయసు, కోల్పోతున్న అవకాశంతో అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినా ఏ మేరకు అవకాశం ఉంటుందోనని అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు. మాతా శిశు మరణాలు అరికట్టడం, పోషణ అభియాన్, ఐసీడీఎస్, ఆరోగ్య లక్ష్మి వంటి కీలక పథకాల అమలులో సీడీపీఓ, విస్తరణ అధికారుల పాత్ర చాలా కీలకం. సీడీపీవోలు ఐసీడీఎస్ పథకం అమలు విభాగంలో, విస్తరణ అధికారులు అంగన్‌వాడీల సెక్టార్ ఇన్‌చార్జులుగా పని చేస్తారు. మహిళా శిశు సంక్షేమ అభివృద్ధిలో వీరి పాత్ర చాలా కీలకం. అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు కూడా వీరి బాధ్యతే. అంగన్వాడీ కేంద్రాలు సమర్థం పని చేయాలంటే ఈ పోస్టుల భర్తీ చాలా కీలకం. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి ఏపీపీఎస్సీచే పోస్టుల భర్తీ నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

విద్యార్థినికి డీఈవో అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్ : ఇస్రో యువికా యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి ఎంపికైన గుంటూరు రూరల్ మండలం రెడ్డిపాలెంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని కాలారి లావణ్యను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అభినందించారు. గురువారం డీఈవో కార్యాలయంలో లావణ్యను అభినందించాక రేణుక మాట్లాడుతూ.. కార్యక్రమానికి గుంటూరు జిల్లా నుంచి ముట్లూరు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి సందు పవన్‌దుర్గ, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి వక్కపట్ల సోమశేఖర్‌తోపాటు లావణ్య ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ ముగ్గురు మే 18 నుంచి 31వ తేదీ వరకు శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రంలో జరగనున్న యువికా యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంలో పాల్గొననున్నట్లు తెలిపారు. లావణ్య భోపాల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నిర్వహించిన సమ్మర్ అవుట్ రీచ్ శిబిరానికి సైతం ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, విద్యార్థిని తల్లి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కృపా మహా సభలు ప్రారంభం



ప్రత్యేక ప్రార్థనలు చేసి మహాసభలను ప్రారంభిస్తున్న బ్రదర్ మ్యాథ్యూస్

గుంటూరు రూరల్ : క్రీస్తు నామంతో గొప్ప జయం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు బ్రదర్ మ్యాథ్యూస్ తెలిపారు. ప్రతి ఏటా కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించే కృపా మహాసభలు గురువారం సాయంత్రం నల్లపాడు రోడ్డులో ప్రారంభమయ్యాయి. కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, మహాసభలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సింగపూర్‌కు చెందిన బ్రదర్ జాకోబ్ చేతుల మీదుగా మహాసభల క్రీస్తు నూతన గీతాల సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మ్యాథ్యూస్ మాట్లాడుతూ క్రీస్తు నామం విజయానికి కీలకమన్నారు. ఏసుక్రీస్తు లోకంలోని పాపుల రక్షణ కోసం తన రక్తాన్ని చిందించారన్నారు. క్రీస్తు నామంలో జయం కలుగుతోందని తెలిపారు. ఏసుక్రీస్తును నమ్మిన వారికి ఆపదలు దరిచేరవన్నారు. ఆయన్ను నమ్మిన వారు ప్రేమతో మెలగాలని సూచించారు. అనంతరం క్రీస్తు వాఖ్యోపదేశం చేశారు. సంగీత దర్శకులు క్రిష్టఫర్, దయలతో రూపొందించిన గీతాల సీడీని ఆవిష్కరించారు. మహాసభల ప్రాంగణం క్రీస్తు నామంతో మారుమోగింది. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ బ్రదర్స్, సిస్టర్స్, సుమారు లక్ష మందికి పైగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీస్తు భక్తులు పాల్గొన్నారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్త



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్ : క్షణికానందం కోసం నిర్లక్ష్యంగా, అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రతి ఏడాది వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై వాహన ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 19 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ కోసం కాజ, పెదకాకాని వద్ద భూ సమీకరణ వెంటనే చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల నుంచి చెత్త సేకరించి జాతీయ రహదారులపై వెళ్లే వాహనాల నుంచి వ్యర్థాలు రోడ్లపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు కావాల్సిన బోర్డులను జీఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్వో ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తగా మారేందుకు తొలినాళ్లలోనే బీజం

గుంటూరు ఎడ్యుకేషన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మేనేజ్‌మెంట్ విద్యార్థులు చదువుకునే సమయంలోనే బీజం వేసుకోవాలని ధరణి ఇన్ఫోటెక్ అధినేత విజయ బాపిరెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'సృజన – మీలో ఎవరు ఎంటర్‌ప్రెన్యూర్' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా విజయ బాపిరెడ్డి మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లినప్పుడే, వాటిని ఆచరణలోకి తీసుకురాగలమని అన్నారు. ప్రస్తుతం దేశంలో అగ్రశ్రేణి కంపెనీలుగా పేరు పొందిన సంస్థలు ఒకనాడు చిన్న ఆలోచనలతో ప్రారంభమైనవేనని వివరించారు. సృజన పోటీల్లో భాగంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా విద్యార్థులు తమ కలను నిజం చేసుకునేందుకు చక్కటి వేదిక అయిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ... విద్యార్థులు స్టార్టప్, వెంచర్‌లను ప్రారంభించడంలో అవసరమైన వ్యవస్థాపక లక్షణాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు. విజేతలుగా నిలిచిన పరిపూర్ణ, హరితం, యార్న్ డిలైట్ బృందాలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ వి.చక్రవర్తి, బి.రాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు ఎ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, బి. అనిత, రాజరాజేశ్వరిదేవి, శశికళ, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు మూఢ నమ్మకాలు బోధించవద్దు

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు సాకేత రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా రచయితల సంఘం, శ్రీసీతారామంజనేయ భక్త సమితి సంయుక్తంగా గురువారం కవి సమ్మేళనం నిర్వహించాయి. శ్రీరాముని లక్షణాలు, రామాయణ ఘట్టాలను కవులు ఉదహరించి, ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేసేలా కవితలు చదివారు. కవి సమ్మేళనం సమన్వయకర్త డాక్టర్ లలిత కుమారి రామాయణం విశిష్టతను వివరించారు. అనంతరం కవులను ఆలయ కమిటీ నిర్వాహకులు కాకి శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులు సత్కరించి, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, పలువురు కవులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పలు వైద్య పరికరాలు

ఫీవర్ ఆసుపత్రిలో ప్రారంభించిన ఇన్‌చార్జి కలెక్టర్



దాత పోలిశెట్టి హరిప్రసాదరావుతో కలిసి మెషిన్‌లను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్‌తేజ

గుంటూరు రూరల్: నగర శివారులోని అమరావతి రోడ్డు గోరంట్లలో ఉన్న ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిక వ్యాధుల వైద్యశాల (ఫీవర్ హాస్పిటల్)లో గురువారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ పలు మెషిన్‌లను ప్రారంభించారు. దాతలు పోలిశెట్టి హరిప్రసాదరావు అందజేసిన ఆటో ఎనలైజర్ మెషిన్, ఐటీసీ జనరల్ మేనేజరు పవన్‌కుమార్ అందజేసిన ఎనస్తీషియా మెషీన్, డాక్టర్ రావెల పద్మావతి అందజేసిన వాటర్ కూలరు, ప్రాంగణంలో సిమెంటు బెంచీలు, ప్రభుత్వం నుంచి మంజూరైన క్రయో బ్రోంకోస్కోపీ మెషినులను ఇన్‌చార్జి కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి సహృదయంతో అండగా నిలిచిన దాతలను సన్మానించారు. మరికొందరు ముందుకు వచ్చి రోగులకు సహాయపడాలని ఇన్‌చార్జి కలెక్టరు కోరారు. అనంతరం ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. హాస్పిటల్‌లో కొన్ని మరమ్మతులు, ఉచిత భోజనశాలపై షెడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, ఐటీసీ సీనియర్ మేనేజర్ గౌరి నాయుడు, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటున్న బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోగల ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం కేవలం ప్రజా ధనాన్ని దండుకుంటూ సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కేసుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కనీసం పేదలకు ప్రశ్నించే హక్కును హరించిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో, నేడు సంక్షేమ పథకాలు లేక ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో గుర్తించాలన్నారు. అనంతరం కార్యకర్తలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలకు వితరణ



మాట్లాడుతున్న కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి

లక్ష్మీపురం: మున్సిపల్ పాఠశాలకు కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి వివిధ సామగ్రి వితరణ చేశారు. గుజ్జనగుండ్లలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల భవనానికి పెయింటింగ్ ఖర్చును అందించారు. ఐరన్ బీరువా, స్టాఫ్ టేబుల్స్, ఇరవై కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సౌకర్యాలను కల్పించటంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. విద్యతో పాటు మౌలిక సౌకర్యాలలో కూడా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు తీర్చిదిద్దటానికి సాయం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ నిధుల ద్వారా కస్టమ్స్, జీఎస్టీ కమిషనరేట్లు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా నిలుస్తాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన్ను పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. నరసింహారావు, ఎం.భాస్కరరావు, కె.సుధారాణి, జీఎస్టీ అధికారులు చీదేళ్ల ఈశ్వరరావు, వరకుమార్, సాదిక్ అలీ, పూర్ణ సాయి, కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత ప్లాన్ ప్రకారం ఫ్లైఓవర్ నిర్మించాలి

- బెటర్ శంకర్ విలాస్ సాధన జేఏసీ డిమాండ్
- లాడ్జి సెంటర్ నుంచి హిందూ కాలేజీ వరకు మానవహారం



మానవహారంలో బెటర్ శంకర్ విలాస్ సాధన జేఏసీ సభ్యులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో గతంలో ప్రకటించిన విధంగా లాడ్జి సెంటర్ నుంచి హిందూ కాలేజీ వరకు శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మించాలని, ఆర్‌యూబీ కూడా ముందే నిర్మించాలని 'బెటర్ శంకర్ విలాస్ బ్రిడ్జి సాధన జేఏసీ' పిలుపు మేరకు గురువారం భారీ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.98 కోట్ల పరిమితి విధించి ఎంత దూరం వస్తే అంత నిర్మించాలని చెప్పటం సరికాదన్నారు. గతంలో ఎంపీ గల్లా జయదేవ్ హయాంలో హిందూ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ వరకు నిర్మిస్తామని రూ.167 కోట్లు బడ్జెట్ అంచనా వేశారని గుర్తు చేశారు. ఇప్పుడు దానికి తగ్గించి నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు ఎలా తీరతాయని ప్రశ్నించారు. రెండు, మూడేళ్లపాటు సాగే బ్రిడ్జి నిర్మాణ సమయంలో ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే ముందుగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఆర్‌యూబీ లేకపోతే ప్రజలు నరకం చూస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు ఎల్.ఎస్. భారవి మాట్లాడుతూ గతంలో టీడీపీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎంపీ గల్లా జయదేవ్ హయాంలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ నిర్మిస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు సాధ్యం కాదని అధికారులు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది అభివృద్ధి వ్యతిరేక పోరాటం కాదని, అందరికీ అభివృద్ధి ఉపయోగపడాలని చేస్తున్న పోరాటం అని అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, జేఏసీ నాయకులు పి.వి. మల్లికార్జునరావులు మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా సమకూర్చి రాజధాని ప్రాంతంలో కీలకమైన ఈ బ్రిడ్జిని చరిత్రలో గుర్తుండిపోయేలా నిర్మించాలన్నారు. ప్రస్తుత డిజైన్‌లో 25 అడుగుల్లోనే సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారని, అందులో డ్రైన్ల కోసం 5 అడుగుల మేర పోతుందని గుర్తుచేశారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరవన్నారు. అనంతరం బ్రాడీపేట వర్తక సంఘం నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్, జేఏసీ నాయకులు కె.నళినీకాంత్, పి.హరీష్, అవధానుల హరి, అవగాహన కార్యదర్శి కె.శివరామిరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు రాధాకృష్ణ, సీనియర్ సిటిజన్స్ నాయకులు సదాశివరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు జి. వెంకట్రావు, నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు షేక్ మస్తాన్ వలి, మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు షేక్ అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.



ఏసీ కళాశాల ముందు మానవహారంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆర్‌యూబీ వెంటనే నిర్మించాలి: ఎస్ఎఫ్ఐ

శంకర్ విలాస్ పైవంతెన నిర్మాణానికి ముందుగానే ఆర్‌యూబీని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన మానవహారంలో ఆయన మాట్లాడుతూ... 90 శాతం ట్రాఫిక్ అవసరాలు తీర్చే శంకర్ విలాస్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేస్తే పరిస్థితి ఎంత అయోమయంగా ఉంటుందో అధికారులు ఆలోచించాలన్నారు. దీనికి కచ్చితమైన పరిష్కారం ముందుగా ఆర్‌యూబీ నిర్మించటమేనన్నారు. విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడం, ప్రజల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆర్‌యూబీని తప్పనిసరిగా నిర్మించాలన్నారు. డొంకరోడ్డు మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్ మళ్లించడం అసాధ్యమని వివరించారు. అత్యవసర సర్వీసులైన గవర్నమెంట్ ఆస్పత్రి, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు ఆర్‌యూబీ ద్వారా సులువుగా, సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, పవన్ జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, భరత్ చంద్ర, సిటీ గరల్స్ కన్వీనర్ సౌమ్య, నగర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, కమిటీ సభ్యులు భాను పాల్గొన్నారు.

వేసవికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే సమ్మర్ ప్రత్యేక రైళ్లను గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ గురువారం రాత్రి వెల్లడించారు. రైలు నంబర్ 07025 చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్ రైలు ప్రతి శుక్రవారం ప్రత్యేక రైలును ఈ నెల 11 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడపనున్నట్లు తెలిపారు. నంబర్ 07026 శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి రైలు ప్రతి శనివారం ఈ నెల 12 నుంచి జూన్ 28వ తేదీ వరకు నడపనున్నారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబర్ 07121 తిరుపతి–మచిలీపట్నం రైలు ప్రతి ఆదివారం, ఈ నెల 13 నుంచి మే 25వ తేదీ వరకు, రైలు నంబర్ 07122 మచిలీపట్నం–తిరుపతి రైలు ప్రతి సోమవారం ఈ నెల 14 నుంచి మే 26వ తేదీ వరకు కేటాయించినట్లు తెలిపారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, పెడన స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.